KSVM 101 H 129

ఓం

# గ్రంథాలయసర్వస్వము

ఆంధ్రదేశ గ్రంథాలయసంఘపక్షమున ప్రకటింపబడు సచిత్రమాసపత్రిక.

సంపుటము ౬]  మే, ౧౯౨౫  [సంచిక ౯

సంపాదకుడు: అయ్యంకి వేంకటరమణయ్య.

## విషయసూచిక


౧ పల్నాటి వీరచరిత్ర (కీర్తనలు) ౨౦౧
౨ మైసూరునందు గ్రంథాలయోత్సవము ౨౦౫
౩ పుదుక్కోట సంస్థానమందు గ్రంథాలయోత్సవము ౨౦౬
౪ ప్రపంచమునందెల్ల గొప్పగ్రంథము ౨౦౭
౫ సరస్వతీమహాలు గ్రంథాలయము, తంజావూరు ,,
౬ గాందేవి గ్రంథాలయము, బరోడారాష్ట్రము ౨౦౮
౭ కార్నీజీ సహాయసంఘము ౨౦౯
౮ వివిధవిషయములు ౨౧౦
౯ ఈడుముదిరినవారికి విద్యాభివృద్ధిచేయు మార్గము ౨౧౧
౧౦ కేంద్రగ్రంథాలయము ౨౧౪
౧౧ గ్రంథభాండాగారి ౨౧౬


చిత్రపటములు:


౧ గాందేవి గ్రంథాలయము—బరోడా.
౨ ఈ గ్రంథాలయమును కట్టించినదాత.


బెజవాడ: ఆంధ్ర గ్రంథాలయ ప్రెస్ (లిమిటెడ్) యందు
క. కోదండరామయ్యగారిచే
ముద్రింపబడి ప్రకటింపబడినది.
౧౯౨౫.

# జడకుచ్చులు

సుప్రసిద్ధాంధ్ర కవులగు

## రాయప్రోలు సుబ్బారావు

గారి నూతన గ్రంథము.

వెల రు. **1—0—0** మాత్రమే.

| | | | |
|---|---|---|---|
| జన్మభూమి. | శేషచైత్రము. | ప్రవాసరాధిక. | కవిత. |
| తమ్ముడా! | పూవు. | సఖీసంవరణం. | ఆచారత్రయము. |
| ఆంధ్రమాత. | పూజ. | మేఘము. | ఒకమాట. |
| ప్రబోధము. | విరహవీధి. | ఎవరు? | రాధపిలుపు. |
| పుస్తకము. | పిలుపు. | కోయిల. | తిలకము. |
| వసంతము. | మధుమాలి. | కనకము. | రామలింగారెడ్డి. |
| శక్తి. | గీతాందేహ. | ధ్యానిబుద్ధప్రతిమ. | కలియుగార్జునుడు. |
| వసంతవికాసము. | | | |

అను విషయములమీఁది పద్యము లిందు గలవు.

వలయువారిట్లు వ్రాయవలెను:—

ఆంధ్రపరిషత్తు: బెజవాడ

---

# గ్రంథాలయోద్యమము

గ్రంథకర్త: యాతగిరి లక్ష్మీ వేంకటరమణ.

వెల రు **0—8—0**


ఇందు 1. ధర్మ గ్రంథాలయస్థాపన. 2. ధర్మ గ్రంథాలయ పాలనము. 3. ఆంధ్రదేశ గ్రంథాలయోద్యమము. 4. ప్రాచీన గ్రంథాలయములు—హిందూదేశము. 5. బరోడా గ్రంథాలయోద్యమము—ఉద్యమ ప్రారంభము. 6. బరోడా గ్రంథాలయోద్యమము—కేంద్ర గ్రంథాలయము. 7. బరోడా గ్రంథాలయోద్యమము—ఉద్యమ నిర్మాణము. 8. గ్రంథాలయోద్యమము—విదేశ గ్రంథాలయములు. 9. గ్రంథాలయోద్యమము—ఇంగ్లాండుదేశము 10. గ్రంథాలయోద్యమము—అమెరికా సంయుక్తరాష్ట్రములు—అను పది అధ్యాయము లున్నవి.

గ్రంథాలయోద్యమమునుగూర్చి విపులముగా దెలుపునట్టి గ్రంథము. బరోడా గాయక్వారుగారి పటము ఇందు గలదు. ప్రతి గ్రంథాలయమును, గ్రంథాలయోద్యమాభిలాషియు తప్పక చదువవలసినది.

వలయువారిట్లు వ్రాయవలెను:—

ఆంధ్రదేశ గ్రంథాలయసంఘము,

బెజవాడ.



కాస్‌జీ ధంజీభాయి గ్రంథాలయము,

గాంఁదేవి, బరోడా రాజ్యము.



కాస్‌జీ థంజీభాయిగారు,

గ్రంథాలయ భవనమును కట్టించినవారు.

సర్వసత్త్వాత్మికాం దేవీం భుక్తిముక్తిఫలప్రదాం
సర్వశాస్త్రాని తామేవ జ్ఞానశక్తిం నమామ్యహం.

ఆరవ సంపుటము.

# గ్రంథాలయసర్వస్వము

## * పల్నాటి వీరచరిత్ర

౧

దేశగౌరవము దీపింపగ తమ దేహమ్ములుగోసి
వీరా - వేశంబున బోరీ
రక్తా - పోశనములు బట్టీ
ఆశ మెయిన్ తలిదేశఋణంబును దీర్చిన వీరులనూ
తల్లీ! వేడుక - వినుతింతూ.

౨

ఆంధ్రవీరులను ఆభరణంబయి అమృతకీర్తిని మించీ
రణమున - ప్రాణము లర్పించీ
వీరా - స్వర్గము సేవించీ
నదులను సురలను నవనవ కవితల నశులీయగ వెలసీ
శూరుల - నయగతులను నిలిపీ.

౩

వెలిగిన బాలుని వీరచరిత్రము వీనుల కింపైన
తీయని - పలుకుల సొంపైన
రసములు - సులుకగ సొగసైన
లలితప్రశస్తిని వలతిలసంబులు కలితముగా గూర్చు
తల్లీ! ధన్యత చేకూర్చూ.

౪

అతిరమ్యంబగు నాంధ్రదేశమున నలరాజు వీరా
ఇంద్రుని - అమరావతితోడూ
ధనదుని - అలకాపురి జోడూ
వ్రతముల క్రతువుల పాడిపంటలను వర్ధిల్లెడి ఊరూ
వీరులు - పుట్టిన పల్నాడూ.

---

* ఈ కీర్తనలు ఒక స్నేహితుని ఇంటియందు పాత కాగితములందు దొరకినవి. ఏ కాలమునాటివో తెలి[యదు.] ప్రాచీనకవికృతములై యుండును నచటను సందియములేదు. శ్రీనాథ మహాకవియే వీనిని రచియించి ఉం[డు]నని పలువురు స్నేహితులు తలంచుచున్నారు. మిక్కిలి రసవంతములుగా నుండుటచే ప్రచు[రింప] బంపితిమి. మిగిలిన భాగము ఎక్కడనైన దొరకినయెడల దానిని పంపిన మిక్కిలి కృతజ్ఞతతో ప్రచురిం[తుము.] ఆంధ్రదేశమునకు అట్టి భాగ్యము చేకూరుగాకయని భగవంతుని ప్రార్థించుచున్నాము.

౫

అంగ సమీపమునందు మనోహర మందమందగతుల
కొరటము - అందమైనపాటా
ఎప్పుడు - ఇంపుగాను బాడా
సందడి పాడెదు నాగులేరు జను లందరు సేవింపా
గంగా - నందని యని పిల్వా.

౬

యేటికి యిటునటు సొంపారగ నమరారెడు నగరీ
బంగరు - పరిమళములు చిమ్మా
భూమిని - పొందగు మాచెర్లా
యక యేలిరి పౌరుషవంతులు పేరెన్నిక గాంచా
ధర్మము - పసివాడక యుండా.

౭

కల మంత్రిశిఖామణియై కడు వాసిగాంచి మించె
బ్రహ్మ - నాయుడు తరియించె
బ్రాహ్మణభక్తిని మితిమించె
కాయణపద నలినమ్ముల మది నమ్మి సుకృతిగాంచె
కీర్తిని - దిక్కుల గీలించె.

౮

గట్టి కదనంబున శత్రుల కడికండలు సేయా
మిత్రుల - కరుణ నభయమీయా
ధాత్రికి - దుష్టభయము బాయా
ను పక్షమున ఒక కాల్వలను ఒక కాల్మంటలనూ
శెట్టి - నీతిని వెలయించె.

౯

కీర్తిని అడవులలో బోయలు గూడను బాడా
సరిరా - జ్యంబుల వ్యాపించీ
సరిలే - దంచును నుతిగాంచీ
స్వర్గము గల్పించెను అతిపుణ్యవంతమాచా
మంత్రిలా - మల్లెదండయగుచూ.

౧౦

త్రనాయని భార్యారత్నము పరమ సుగుణవల్లీ
ఐతము - భాగ్య కనక వల్లీ
వీర కుమారులకును తల్లీ
సతీపద పద్మ సమార్చన భాసిల్లిన మల్లీ
కీర్తిక - లాపముల- సుతల్లీ

౧౧

అర్థుల కీయగ నన్నపూర్ణయని అందరు కొనియాడా
అబలలు - కందరాని యశమూ
ఐతము - ప్రీతిని గడియించీ
వర్థిలె పుణ్యనివాస మనంగను వడివంకలు లేనీ
నడవడి పడతులు ప్రేమింపా.

౧౨

చేసినపూవుల చిత్తపూజలును శ్రీపతిసేవలునూ
నోచిన - అచ్చపునోములునూ
పంచిన - పండ్లవాయనములున్
వాని ఫలింపగ ఐతమగర్భము భాసురముగ పండెన్
తండ్రులా - కోర్కెలెల్ల నిండెన్.

౧౩

మహనీయుండగు ఐతమపుత్రుడు మహిపై బడు వేళన్
గ్రహములు భగభగ తెగమండెన్
దిక్కులు గడగడ కడు వడికెన్
దహనుని ప్రళయము తాకిన పగిదిని దద్దరిల్లె జగముల్
శేషుడు - తలలు వంగ జంకెన్.

౧౪

ఆబాలుని శిరోదయ సమయమునందుపడిన నీరూ
హేమమ - యంబగు మేడలనూ
రత్నభ - రంబగు గోడలనూ
ప్రాబల్యంబున పగులగొట్టుకొని పాతాళముకేగెన్
భూమియు - బద్దలగుచు లోగెన్.

౧౫

వీరుడు వీరుడు వీరుడటంచును వింతకంఠమెత్తీ
రభసము - రాపాడెడు రక్తీ
నభమున - వినిపించెను వాణీ
పారిజాతములు జోరునగురిసెను పరిమళములు పొదలా
పౌరుల - వేడుక లుప్పొంగా.

౧౬

కానక కన్నకుమారునిగాంచియు కన్నులపండువుగా
పలిపిరి - దానములను తండ్రుల్
కొలిచిరి - కులపతులను పౌరుల్
తెలిపిరి బాలుండితడని భూసురతిలకులు మంత్రోక్తిన్
సభ్యులు సంతసింపరక్తిన్.

౧౭

దిన దిన మొకపొందికయగు అందము తేటదేరి మెరయ
అవయవ - సవ్యరుచులు విరియ
నిద్దపు - చక్కదనము లూరియ
గోనబారెడి ముఖకోమల కాంతులు కొదమవన్నెలీన
ఐతమ తనయు డెదిగె నిటులా.

౧౮

బాలుని బాల్యము పసిడియుయ్యాలల భాగ్యసౌధములలో
పూచిన - సంపగి పూభంగి
మొలిచినా - కనక రేఖరీతి
లాలించిరి కడుగారాబంబున లీలల జోలలతోన్
ముద్దుల - సోలించిరి తమితోన్.

౧౯

పన్నెండేండ్ల కుమారుని ప్రాయము పసుచుదనమురాగా
మిసమిస - వన్నెలొలుకబాగా
మొగమున - సొగరుతీగెసాగా
నున్నని మీసము నూనూగుగ మొలకెత్తి మోజులీనెన్
సొగసొక - సొగసీవిదేరెన్.

౨౦

ఈడువచ్చి కళలీనెడి బాలుని ఇంపుసొంపులరసి
పెండ్లికి - వేడుకపడి మురిసీ
జనకులు - బాంధవులు తెరచీ
ఈడును జోడును కులశీలములును కూడినరాజింటన్
కన్యను - తోడుదెచ్చి రుత్కంఠన్.

౨౧

మగువమాంచాలకు మానధనుండగు సొగసులబాలునకున్
జరిగెను - మంగళ కార్యములూ
మొరసెను - శోభన వాద్యములూ
తగినవధూవరులంచును చూపరు లగణితముగ బొగడ
బ్రాహ్మణ - దీవనలును మిగులా.

౨౨

కలిసి బాలునకు కర్మవశంబున కామిని సబ్బాయీ
ఆచెలి - వలపులలో దగిలీ
మరచెను - మగువను మాంచాలన్
వెలసఖి పలుకులు కులుకులు తళుకులు వింతమందులగుచూ
బాలుని - మనసు విరిచివేయూ.

౨3

తాళిగట్టి తను బాసలు జేసిన ధర్మపత్ని మాంచాలన్
బాలుడు - దరిశియేరుగడాయెన్
సబ్బాయి - తన్నువిడువదాయెన్
తన కర్మంబని దైవకృతంబని ధర్మపథము విడక
ఆయమ - తపసు జేయుచుండెన్.

౨౪

తెల్లనికోకలు తీరిచికట్టుదు మల్లెపూలసరులన్
మెడలో - కొల్లలుగా నిడదూ
ఎదలో - నల్లాసముగనదూ
సల్లాపింపక మాసినమెయితో చాన గడుపు దినముల్
భ్రమరము - రానిపూవు పోల్కెన్.

౨౫

అటబాలుండొకనాడుదయంబున ఆటల తమకమునా
సహచరు - లందరు కుతుకమునా
తనతో - చనుదేరగ వీధీ
నేటుంగోటుగ బొంగరాలాటను బాటించిరి వేడ్కన్
పకపక - లాడుచూరి బైటన్.

౨౬

నిమ్మలబావికి నీరుదెచ్చుటకు నెలత లేగుదెంత్రూ
వారిలో - వైశ్యవనితయొకతే
బాల నీ - వాలకముగుజూచీ
సమ్మదమందుచు నిమ్మళముగ నట జనుచునుండె నంతన్
బొంగరము - సఖియ చరణమంటెన్.

౨౭

తాకిన బొంగరపుదెబ్బకు వనితయు తల్లడిల్లుచుగూలీ
కోపము - దహించుపగ కినిసీ
తహ తహ - పొరలాడుచు లేచీ
తాళలేక బాలచంద్రుని దిట్టుచు తరుణులెల్లమూగన్
వల వల - ఏడ్చుచు గొంతెత్తి

౨౮

ఓరిమదాంధుడ, ఓరినరాధమ ఓరికులద్రోహీ
నీకీ - చేటుకాలమేలా
కన్నుల - కింతపొగరు మేలా
అరయుజాలవు కండకొవ్వున కులగౌరవముల నేసీ
పోరులా - మరియాదనుగానీ.

౨౯

వారవధూటికి అడుగులొత్త నలవాటుపడిన నీవూ
పెండ్లము నెడబాసిన నీవూ
తండ్రుల - గతులెరుగని నీవూ
క్రూరుడవై కులకాంతా జనముల కొట్టసాగినావే
ఇంతటి - దగునె నీకుచేవా.

౩౦

చందమామరమున నాయకురాల్ నీతండ్రిలచెందాడా
పన్నిన — వ్యూహంబులజిక్కి
పడలిన — సాహసము దక్కి
కొండగుచుండగ హాంగరాలాడేదు దండించియుంట బట్టి
కడుమున — వీరకాశిగట్టి.

౩౧

అనికోవటిపతి తెగబడి తిట్టిన ఆటకించి బాలం
డెదలో — కరుణరేఖ లెత్తెన్
తోడ్తో — దుఃఖభరము లొత్తెన్
విషయంబున నాసతి వేగిబని అంగయు స్వామీకూర్కిన్
ఆదరు — నాలకింపక కిక్.

౩౨

తల్లి వగుదువో తరుణీరత్నమ దయజూపుము నాపై
తెలియని — అపరాధము సైచి
నాపై — తగిన శిక్ష వైచి
కల్లగావు సల్లాపంబులు కనికారములో వినుమూ
దైవము — సాక్షి నిజము గనుమా.

౩౩

ఆటల మోజున నయ్యె ప్రమాదము ఆత్మకినియబోకూ
చేసెద — నుపచారము నీకూ
కలహము — పలికి వైకతేసూ
గాటపు నిందను బాపికొనంగను కలతెరగును మాకూ
తెలుపుము — వందనములు నీకూ

౩౪

అనుతాపంబున బాలుండాడిన ఆమాటలు వినుచూ
జనములు — ఆశ్చర్యముగనుచూ
బాలుని — డింతయు నెన్న యనుచూ [సతీ
పెనబడిపలుకుచు మౌనమునూగియగుగొనుచుపోయిరం
కోమటి — కోమలిపై చింతన్.

౩౫

అంతట బాలుండంతరంగమున నాందోళము బడుచూ
సారసు — వైశ్యవనిత పలుకుల్
తనమది — ముల్లులగుచు తగులన్
చింతావశుడై తల్లి యతిమను జేరబోయి వేగన్
సంశయా — భావము లేదరేగన్.

౩౬

వచ్చిన బాలుని గనుగొని వైశ్యను పొచ్చిన ప్రతీతిన్
కన్నుల — కౌగలించి ప్రేమన్
కుశలము — లడిగి గారవమునన్
మెచ్చుల పీఠమునిచ్చి కనుంగవ విచ్చిన బావ్పములన్
నిలిచెను — ఆనందాలసయై.

౩౭

బాలుండయ్యెడ సాష్టాంగంబుగ భక్తిసలిపి తల్లీ
ఆయా — మాటలాడి పలికెన్
చిత్తము — నుత్తరించు కలకన్
తల్లీ! యడిగెదనొక యర్థంబును దాచక యొసగింపూ
వీరులా — గన్నఫలము నింపూ.

౩౮

ఎక్కడికేగిరి నాజనకులు రణవీరుల దాపురంబు
కలసిన — సీమ పాలవలెనూ
మెలగిన — అన్నదమ్ము లేలా
చిక్కకొనిరి యా నాయకురాలికి దిక్కుమాలి యకటా
తల్లీ! — చెప్పుమేల దాచా.

౩౯

కాకలు దీరిన గండుమగలతో కారెమపూడిపురము
తీవ్రపు — కదనరంగమయ్యెన్
కత్తుల — వియ్యమెట్లు గలసెన్
నాకానందము నపనవలాడగ చెవొవి వినుపింపూ
వీరులా — ధర్మము నెరిగింపూ.

౪౦

శూరులకిరవగు నీపుట్టింటికి వీరవాసమైనా
ధైర్యపు — జీవగడ్డయైనా
పదువగు — నీపల్నాటికినీ
పేరుమాపు నీసిరికి విధంబులు చేరనీయబోకూ
నీమది — వీరమాతవగుచూ

# మైసూరునందు గ్రంథాలయోద్యమము

ప్రాచీన కాలమునుండియు మైసూరు రాజ్యము పండితబృందమునకును, విద్యాపోషణకును ప్రఖ్యాతి గాంచియున్నది. ఈ సంస్థానాధీశులయొక్క ప్రాపకమువలన వాఙ్మయాభివృద్ధికి కొరంత లేకుండెను. ఆ రాజ్యమునందుగల విద్యాసంస్థలయొక్కయు, గ్రంథాలయములయొక్కయు, ప్రదర్శనశాలలయొక్కయు సంఖ్యయే ఆ రాజ్యాధిపతులకును సంస్థానప్రజలయొక్క అభివృద్ధియెడలగల అభినివేశమును వెల్లడిచేయుచుండును. ప్రస్తుతము మనము ఆ రాజ్యమందలి గ్రంథాలయోద్యమమును గూర్చి కొంత చెప్పుకొందము.

## ప్రాచీన కాలము

పూర్వము గ్రంథాలయములన్న పుస్తకములను చేర్చి ఒకచోట పెట్టుటయు, అవి వాని స్వంతదారులకు మాత్రము ఉపయోగపడుటయు మాత్రము జరుగుచుండెను. మైసూరు రాజమందిరమునందున్న టిప్పుసుల్తాను గ్రంథాలయము, శృంగేరి మఠమునందుగల గ్రంథాలయమును ఇట్టివియే. 1915 సంవత్సరమునకు పూర్వము వానిని జనులకు ఉపయోగకరములగునటుల చేయుటకు ప్రయత్నమేమాత్రమును జరిగియుండలేదు.

## నవీన కాలము

స్వల్ప సంఖ్యాకులుగనున్న విద్యాధికులకు ఆనందము నొడగూర్చుటయే గాక, వారి ఇచ్ఛకు వ్యతిరేకముగనైన జ్ఞానాభివృద్ధి నొందనివారికిగూడ విద్యాసక్తిని గలిగించి, సంతృప్తి పరచుటయే నేటి సార్వజనిక గ్రంథాలయములయొక్క ధర్మమై యున్నది. ఈ నూతనాభిప్రాయము పాశ్చాత్య దేశములందు 60 సంవత్సరముల క్రిందట వ్యాపకమునకు తేబడి, జనులకు జ్ఞానాభివృద్ధిని జేయుటకు అమూల్యమగు మార్గముగ పని జేయుటచే నాగరికతబొందిన దేశములన్నిటియందును విశేషమగు వ్యాప్తిని బొందినది. ఈ యభిప్రాయము 1909 సంవత్సరమున బరోడా మహారాజాగారిచే భారతవర్షమునకు గొనితేబడినది. అందుచేత వారు భారత గ్రంథాలయోద్యమ జనకుడని పిలువబడుచున్నారు. అమెరికాదేశ సార్వజనిక గ్రంథాలయపద్ధతులు బరోడా రాజ్యమందు జయప్రదముగ నిర్వహింపబడుటచేత పాశ్చాత్య గ్రంథాలయ పద్ధతులను హిందూదేశమునందు నాటుట మంచిదిగాదను అనుమానము భారతీయుల మనస్సులనుండి తొలగిపోయెను.

బరోడా రాజ్యమందు ఈనూతనోద్యమము జయప్రదమగుటను గమనించి మైసూరు గవర్నమెంటువారు గూడ 1914 సంవత్సరమున బెంగుళూరు పట్టణమందొకటియు మైసూరుపట్టణమునందొకటియు ధర్మగ్రంథాలయములను ప్రతిష్ఠాపించినారు. వీనికి 35 వేల రూపాయలు ఖర్చు అయ్యెను. ఇవి గాక ప్రతిసాలునా రు 6,800లు ఖర్చు అగుచున్నవి.

ఈ గ్రంథాలయములందు రెండుశాఖలు గలవు. చందాదారులకు పుస్తకములను ఇండ్లకు ఎరువిచ్చు శాఖయొకటి; జనులను ధర్మార్థముగా చదువుకొననిచ్చు శాఖ రెండవది. ఈ గ్రంథాలయములు 15 గురు సభ్యుల చేత పరిపాలింపబడుచున్నవి. అందు ఏడుగురు సభ్యులు చందాదారులచేత ఎన్నుకొనబడుచుందురు. మిగిలినవారు మైసూరు గవర్నమెంటువారిచే నిర్ణయింపబడుచుందురు. అవి కొంతవరకు చందాలవలనను, మరికొంతవరకు గవర్నమెంటువారివలనను పోషింపబడుచున్నవి.

నవీన అమెరికాదేశ సర్వగ్రంథాలయ పద్ధతులను అవలంబించుటచేత బెంగుళూరు గ్రంథాలయము పది సంవత్సరముల క్రిందటమాత్రమే స్థాపింపబడినప్పటికిని దక్షిణహిందూదేశమునందెల్ల అగ్రస్థానము వహించినదని చెప్పవచ్చును. గ్రంథవివరణము, పుస్తకములను ఎరువిచ్చు పద్ధతులు, అమెరికాదేశ నవీనశాస్త్రపద్ధతులను అనుకరించియే యున్నవి. స్త్రీలును పురుషులనుగూడ ప్రత్యేక ప్రత్యేకముగ కూర్చుని చదువుకొనుటకై గదులు ఏర్పాటు చేయబడినవి. పిల్లలకు ప్రత్యేకశాఖ ఏర్పరుపబడినది. బీదలు గ్రంథములు ఎరువుపుచ్చుకొనుట కొక శాఖ, వర్తక పారిశ్రామిక వాదవిషయములకు ప్రత్యేకమొక బల్ల, ప్రత్యేకమొక పరిచరణశాఖ, స్నానపుగదులు, ఫలవములగను, ఇట్టివి ఎన్నియో గలవు. ఇందుగల గ్రంథములయొక్క అధిక్యతనుబట్టియు మధ్యస్థలమునందుండుటను బట్టియు, ఇది కేంద్రగ్రంథాలయముగాక తప్పదు.

ఇంతటితో నూరుకొనక మండలగ్రంథాలయములను తాలూకా గ్రంథాలయములను గూడ ఏర్పాటు చేయుటకు 1917 సంవత్సరమున మైసూరు ప్రభుత్వమువారు పూనుకొని అట్టివానిని ఏబదివరకు ఏర్పరచినారు. పిమ్మట గ్రామగ్రంథాలయ స్థాపనకు గడంగినారు. స్థానికులు కొంత సహాయమును చేయునెడల ప్రభుత్వమువారు గూడ కొంతసహాయమును చేయుటకు పూనుకొన్నారు. కాని గ్రంథములు చదువుటవలన ప్రయోజనములను జనులు గ్రహింపజాలమిచే ఈ సహాయమును

ఎక్కువగా ఉపయోగించుకొనుట లేదు. ప్రతి గ్రామమునకును గ్రంథాలయమును స్థాపించు సౌకర్యములుండుట దుస్తరమగుటచేత 1918 వ సంవత్సరమునందు సంచార గ్రంథాలయ పేటికల సంపుటమునుగూడ ప్రారంభించిరి. ఇట్టిసంచార గ్రంథాలయ పేటికలను 77 పెట్టెలను తయారుచేయించి వానిని 77 గ్రామములకు పంపిరి.

ఈసంచార గ్రంథాలయ పేటికలను ఏగ్రామస్థులైన తమగ్రామ ఉపయోగార్థమై కొనదలచినయెడల సగము ఖరీదునకె ప్రభుత్వమువారు యిచ్చెదరు. ఆరోగ్యము, విద్య, అంటువ్యాధులు మున్నగు పల్లెటూరిజనులకు ఆకర్షవంతములుగ నుండెడు విషయములనుగూర్చి మ్యాజిక్కు లాంతరుతో ఉపన్యాసములిప్పించుటగూడ 1919 సంవత్సరమున ప్రారంభింప బడెను.

గ్రంథాలయ పరిపాలనము విద్యాశాఖక్రింద గలదు. ఇందుకై ప్రత్యేకము ఒక "ఆర్గనైజరు" ఇద్దరుఇనస్పెక్టర్లు ఒక ఉపన్యాసకుడు, సినిమా నడుపువారొకరు గలరు. యుద్ధానంతరము జనుల వర్తకమునందు తగ్గుదల గాన్పించెను. అందుచేత ప్రభుత్వమువారి ఆదాయముకూడ తగ్గుట కారంభించెను. అందుచేత గ్రంథాలయములకై ప్రత్యేకముగ నియమించిన ఉద్యోగులను తగ్గించిరి. పల్లెటూరు గ్రంథాలయముల అభివృద్ధికి జేయుచున్న సహాయమును గూడ తగ్గించివేసిరి.

బెంగుళూరు, మైసూరు పట్టణములయందున్న గ్రంథాలయములకు గూడ కొంతసహాయము తగ్గింపబడెను. కాని అవిఇంతవరకు జనులయందు కలుగజేసిన అభిరుచి వలన, జనులయొక్క సహాయము అభివృద్ధి యయ్యెను.

మంచిదినము రాగానే, మైసూరు రాజుగారు తిరిగి గ్రంథాలయోద్యమమును రాజ్యమందంతటను వ్యాపింప జేయుదురనుట కెంతమాత్రము సందియము లేదు.

# పుదుక్కోట సంస్థానమందు గ్రంథాలయోద్యమము

ఒకజాతియొక్క అభివృద్ధికిని సౌఖ్యమునకును ధర్మగ్రంథాలయమువంటిది మరియొకటిలేదు. పుదుక్కోట సంస్థానమందుగల 441 గ్రామములలో 32 గ్రామములందుమాత్రము గ్రంథాలయములు, పఠనమందిరములు, స్థాపింపబడినవి. పల్లెటూరునందుండు ఉపాధ్యాయుడే గ్రంథభాండాగారిగా నుండుటకు తగినవాడు. అతడే దానికాధారభూతుడు. ఆ సంస్థానమునందుగల దాదాపు అన్నిగ్రంథాలయములును వారివారి గ్రామములందుగల పంతుళ్లవల్ల స్థాపింపబడినవైయున్నవి. వారిశ్రద్ధవల్లనే అవి వెంపొందుచున్నవి.

పట్టణములందు పెద్దగ్రంథాలయములుగూడ గలవు. ఇట్టివి మూడు తాలూకా పట్టణములందుగలవు.

పదునెనిమిది సంచారగ్రంథాలయ పేటికలు విద్యాశాఖవారివలన ప్రచారమునకు దేబడుచున్నవి.

చదువుకొనజాలని జనులకు జ్ఞానమును గలుగజేయుటకై కాలక్షేపములు, ఉపన్యాసములు మిక్కిలి ప్రయోజనకరములు. ఈ విషయమునగూడ యీగ్రంథాలయములు పాటుబడుచున్నవి.

ప్రత్యేకము స్త్రీలకొరకు రాజధాని పట్టణమునం దొకటియు తాలూకాపట్టణములందు మూడును గ్రంథాలయములు గలవు. వానిని ఆయాగ్రామములందుగల ఉపాధ్యాయులే నిర్వహించుచున్నారు.

కొద్ది మాసములక్రిందటనే శ్రీ సూరి వెంకట నరసింహశాస్త్రిగారి అధ్యక్షత క్రింద ఐదవ గ్రంథాలయ మహాసభ జరిగినప్పటినుండియు యీసంస్థాన గ్రంథాలయోద్యమమునం దొక నూతనశకము ప్రారంభమైనది. వారి సలహావలన కేంద్రగ్రంథాలయస్థాపనము జరుగుచున్నది.

గ్రంథాలయోద్యమమువలననే జ్ఞానభిక్ష జనులకు లభ్యము కాగలదు. గ్రంథాలయోద్యమమువలననే జాతి అంతయు ఒకే మాటమీద నిలువబడగలదు. గ్రంథాలయోద్యమమువలన జీవసహితమైనట్టియు, స్థిరమైనట్టియు, ఐకమత్యము చేకూరగలదు. గ్రంథాలయోద్యమమువలననే భారతవర్షము ఇతర జాతులయందు తన యర్హస్థానమును పొందగలదు.

# ప్రపంచమునందెల్ల గొప్ప గ్రంథము

ప్రపంచమునందున్న గ్రంథములందెల్ల గొప్పగ్రంథము చీనాదేశమందు ఉద్భవిల్లిన విజ్ఞానసర్వస్వ మను గ్రంథము. ఈ గ్రంథము 11,100 సంపుటములుగా వ్రాయబడినది. ఈ సంపుటములలో రెండు ఇటీవలనే లండను గ్రంథాలయమునకు చేరినవి. చైనాదేశ పండితమండలిచేత తయారు చేయబడిన ఈ గొప్ప గ్రంథము 1900వ సంవత్సరమున "బోక్సరు" నందు జరిగిన తిరుగుబాటు యుద్ధమునందు నాశనమైపోయెను. అక్కడనున్న కాలేజీకి తిరుగుబాటుదారులు అగ్నిపెట్టగా ఆ కాలేజీయందున్న ఈగ్రంథము నుండిపోయెను. ఆ కాలేజీ భవనముయొక్క శిథిలములనుండి ఈ మహాగ్రంథముయొక్క కొద్దిసంపుటములు మాత్రము సంరక్షింపబడినవి. చైనాదేశమునకు 1860 వ సంవత్సరమునుండియు విదేశీయులను రానిచ్చుచుండినను ఈ గ్రంథమును మాత్రము వారిని చదువుకొన నిచ్చెడివారుగారు.

చైనాదేశము నేలిన రాజులలో ప్రముఖుడగు "యంగులో" అను పేరుగల రాజు ఈ గ్రంథమును వ్రాయింప 1403 సంవత్సరములో దలపెట్టెను. "హేచిన్" అను గొప్ప పండితుని రావించి, ఈమహాగ్రంథమును తయారుచేయవలసినదని ఆజ్ఞాపించెను. ఆయన 146 మంది పండితుల సహాయముతో 16 మాసములకాలములో గ్రంథమును ముగింపగలిగెను. కాని రాజుగారికి [illegible] సంతృప్తి గలిగింపలేదు. అందుచేత తిరిగి మరియొక గొప్ప [illegible] కై ము గ్గురు అధిపతులను, అయిదుగురు సంపాదకులను, ఇరువది సహాయసంపాదకులను ౨౧౮౦ మంది సహకారులను మొత్తము ౨౧౮౬ మందిని ఏర్పరచెను. వీరందరును అహోరాత్రములు కష్టించి పనిజేసి నాల్గు సంవత్సరముల కాలములో ౧౧,౦౦౦ సంపుటములు గలిగిన "విజ్ఞానసర్వస్వము"ను తయారుచేసిరి. ఈగ్రంథమునందు ౨౨౯౩౭ విభాగములు గలవు. ఇవిగాక ౬౦ విభాగములలో విషయవివరణము గలదు. ఈ సంపుటములలో ప్రతిగ్రంథము అరఅంగుళము దళసరియుండును. ఈసంపుటము లన్నియును ఒకదానిమీద మరియొకటి పెట్టినయెడల 450 అడుగులఎత్తగును. ప్రతి సంపుటమున్ను ఒకఅడుగు వెడల్పును, ఇరవైఅంగుళముల పొడవును గలిగియుండి అట్టతో బైండుచేయబడి యుండి పసుపుపచ్చపట్టుతో అలంకరింపబడి యుండెను. ఒక్కొక్క విభాగమునందు ఇరువదిపుటలు వంతున మొత్తము గ్రంథమందు ౯౧౭,౪౮౦ పుటలుగలవు. ఆంగ్లేయుల విజ్ఞాన సర్వస్వమునందు ౨౨,౦౦౦ పుటలు మాత్రమే గలవు. రాజుగారు ఈగ్రంథమును అచ్చువేయింప దలంచిరి. కాని వ్యయము అత్యధికమగునని మాని ఆ ప్రయత్నమును విరమించిరి.

౧౫౬౨ సంవత్సరమునందు ఈ మహాగ్రంథమునకు నకలును వ్రాయుటకు 100 మంది పండితులను నియమించిరి. వారు నకలును ౧౫౬౭ సంవత్సరమునందు ముగింపగలిగిరి. ౧౬౪౪ సంవత్సరమునందు రాజవంశము అంతరించినప్పుడు నకలు గ్రంథము తగులబడిపోయినది. పిమ్మట అసలు ప్రతిని "బోక్సరు" కాలేజీకి మార్చిరి. ఆ నూర్పు జరిగినపిమ్మట అనేక సంపుటములు అగుపడకుండపోయినవి.

చైనా ప్రభుత్వ [illegible]వారు విదేశీయులను ఈ గ్రంథములను చదువనివ్వకపోవుటచే [illegible] ఆ గ్రంథములందున్న అమూల్యవిషయములన్నియు బైటకు [illegible]కుండపోయినవి.

# సరస్వతీ మహాలు గ్రంథాలయము, తంజావూరు

ప్రపంచమునందున్న గ్రంథాలయములలోకెల్ల ఈ గ్రంథాలయము పెద్దదియును మిక్కిలి ప్రామఖ్యత జెందినదియు నైయున్నది. 16,17 శతాబ్దములందు దక్షిణజిల్లాల నేలిన తెలుగునాయకరాజులచే ఈ గ్రంథాలయము ప్రారంభింపబడినది. అప్పటినుండి యు పిమ్మట వచ్చిన రాజులెల్లరు దీనిని అభివృద్ధిపరచుచునే యుండిరి. తంజావూరు నేలిన మహారాష్ట్రప్రభువులు లెక్కలేనన్ని తాటియాకు గ్రంథములను ఈగ్రంథాలయమునకు జేర్చిరి.

ప్రస్తుతము ఈగ్రంథాలయము తంజావూరు రాజకుటుంబమునుండి ఒక ప్రతినిధి కలెక్టరు, జిల్లాజడ్జి, గ్రామస్థులనుండి ఒక ప్రతినిధి గలిగిన సంఘముచే పరిపాలింపబడుచున్నది. గ్రామస్థుల ప్రతినిధియగు టి. సాంబమూర్తిరావుగారు ప్రస్తుతము గౌరవ కార్యదర్శిగా పనిజేయుచున్నారు. గౌరవ కార్యదర్శియైనను జీతము పుచ్చుకొనువానికంటె ఎక్కువగానే గ్రంథాలయమునకై పనిజేయుచున్నారు.

ఈ గ్రంథాలయ సంఘమువారు 1923-24 సంవత్సరమునకు రిపోర్టును ప్రకటించినారు. వ్రాత ప్రతులను సంరక్షించుటయేగాక ఈదిగువ వివరించిన పనులనుగూడ ఈ సంఘమువారు చేసిరి.

(1) వ్రాతప్రతులకు విషయ వివరములను దెలుపు క్యాటలాగులను తయారు చేయుట.

(2) అమూల్యములగు వ్రాత గ్రంథములకు ప్రతులను ఇతర సంఘములకుగాని వ్యక్తులకుగాని వ్రాయించి యిచ్చుట.

(3) వ్రాత గ్రంథములకు వివరణ పట్టికలను తయారు చేయుట.

(4) శిధిలమగుచున్న గ్రంథములకు తిరిగి ప్రతులను వ్రాయించుట.

(5) గ్రంథాలయమున జనులను చదువుకొననిచ్చుట.

ఈ సంవత్సరమందు 2,368 వ్రాతప్రతులు ఇతరులచే జదువబడినవి. శిధిలమగుచున్న 49 గ్రంథములను తిరిగి మంచి కాగితములమీద వ్రాయించిరి. ఇతరుల ఉపయోగమునకై 33 గ్రంథములకు వ్రాతప్రతులు వ్రాయించబడినవి. అరవగ్రంథములకు వివరణపట్టిక ముద్రింపబడుచున్నది. సంస్కృతాంధ్ర గ్రంథములకు గ్రంథ వివరణ పట్టికలను తయారుచేయుట అత్యంతావశ్యకమై యున్నది. ఈ పనికై గ్రాంటుకొరకు ప్రభుత్వమువారిని అడిగిరి. తంజావూరు మహారాజావారి కుటుంబము వారిచే నియ్యబడిన మూలధనము వలనను ప్రభుత్వము వారి గ్రాంటులవలనను ఈ గ్రంథాలయము పోషింపబడుచున్నది. కాని ఈ ప్రకారము వచ్చు ఆదాయము ఈ గ్రంథాలయము చేయవలసిన పనులన్నిటికిని సరిపోవుటలేదు. అందుచేత మహనీయులు సహాయముచేసి ఈ గ్రంథాలయమునందున్న అపూర్వములగు వ్రాత గ్రంథములు శిధిలమైపోకుండ కాపాడి గ్రంథవివరణపట్టికలను వ్రాయించుట అత్యంతావశ్యకమై యున్నది.

ఆంధ్రులు నిర్వహింపవలసిన ప్రత్యేకమగు ధర్మమొకటి గలదు. ఆంధ్రుల అపూర్వములగు వ్రాతగ్రంథములనేకములు ఈ గ్రంథాలయమందుగలవు. అట్టి స్థితియందు ఆంధ్రగ్రంథముల వివరణపట్టిక ఇంతవరకును తయారు కాకపోవుట మిక్కిలి శోచనీయము. ఇదిగాక ఈ గ్రంథాలయమునందున్న ఆంధ్ర అపూర్వ గ్రంథములను ప్రకటించుటగూడ అత్యంతావశ్యకమై యున్నది. ఈ పనులను పూర్తిజేసి ఆంధ్రులు ఈ గ్రంథాలయమును నిరాదరించుచున్నారను అపనిందను బాపుకొందురని కోరుచున్నారము.

---

# కాస్‌జీధంజీభాయి గ్రంథాలయము,

గాం[illegible], [illegible] రాష్ట్రము.

బరోడా రాష్ట్రమందున్న జిల్లాపట్టణమగు గాందేవి యందు ఈగ్రంథాలయము 60 సంవత్సరములక్రిందట కొంతమంది పౌరులచే స్థాపింపబడినది. ఆకాలమున అసలు విద్యావ్యాపకమే తక్కువ. పెద్దల విద్యాభివృద్ధికి గ్రంథాలయము తోడ్పడునను యభిప్రాయము అసలే లేదు. అట్టికాలమున గ్రంథాలయమును స్థాపించుట మిక్కిలి ప్రశంసనీయమైన సంగతి.

ఇప్పుడీగ్రంథాలయము మండల గ్రంథాలయమై మండలాభివృద్ధికి విశేషముగా తోడ్పడుచున్నది. బరోడా ప్రభుత్వమునుండి గ్రాంటును పొందుచున్నను గ్రామస్థులచేతనే పరిపాలింపబడుచున్నది. పదిసంవత్సరములలో ఈగ్రంథాలయమందున్న గ్రంథములు 1 000 నుండి 7,000 లకు వృద్ధియయ్యెను. దీనికి రు17,000 విలువగల స్వంత భవనము గలదు. రు 7,000 లు మూలధనము గలదు.

తాలూకాయందున్న గ్రామము లన్నింటియందును గ్రంథాలయములను స్థాపించుటకై ఈ గ్రంథాలయ నిర్వాహకులు విశేషముగా పాటుబడుచున్నారు.

---

# కార్నెజీ సహాయసంఘము

గ్రంథాలయోద్యమమునందు జరుగుచున్న పలువిధములగు కార్యములను గ్రంథాలయములు జరుపను చేయుచున్న పలురకములగు సేవయును కార్నెజీ సహాయ సంఘమువారు చేయుచున్న కార్యక్రమమును బట్టి తెలిసికొనవచ్చును.

ప్రపంచము నందున్న అన్ని దేశములందును అమెరికా దేశవాస్తవ్యుడగు కార్నెజీ మహాశయుని నెరుంగనివారుండరు. ఆయన దానములలో చాలభాగము ఆయన ద్రవ్యార్జనము చేసిన అమెరికా దేశమునందే చేయబడినప్పటికిని ఆయన జన్మదేశమగు బ్రిటిషుదీవులందుగూడ దానధర్మములను జేసెను. తాను జేసిన దానధర్మములను నిర్వహించుటకు ఒక సంఘము నేర్పరిచెను. ఆసంఘము స్థాపించి పండ్రెండు సంవత్సరముల కాలమైయున్నది. మొదటి అయిదు సంవత్సరముల కాలములో ఈ సంఘము చేయవలసిన పనినిగూర్చి విచారించిరి. యుద్ధకాలమగు 1914 మొదలు 1918 సంవత్సరము వరకును ఈసంఘము పనిని బొత్తిగా మానివేయవలసి వచ్చెను. కాని 1922, 1923, 1924 సంవత్సరములయందీ సంఘము విశేషముగు అభివృద్ధిని జూపినది. ఈ సంఘము నిర్వహించుచున్న పనులలో ముఖ్యమైనవి (1) పల్లెటూళ్ల అభివృద్ధి (2) గ్రంథాలయ స్థాపన (3) పల్లెటూళ్లయందు పాటకచ్చేరీలను, నాటకములు మున్నగు వానిని ఏర్పాటు చేయుట (4) గ్రుడ్డివారికి గ్రంథాలయము (5) శరీర పరిశ్రమ (6) విద్యార్థుల బసలకు తగిన ఏర్పాట్లుచేయుట.

పల్లెటూళ్ల అభివృద్ధివిషయమై ఒక్కసలహాసంఘము నేర్పరచిరి. ఈసంఘముయొక్క ఖర్చులకై మూడు సంవత్సరములవరకు సంవత్సరమునకు 15000 రూపాయల చొప్పున మంజూరుచేసిరి. ఈసంఘమునందు రాజ్యాభివృద్ధినిగోరు ప్రభుత్వమువారియొక్కయు ప్రజలయొక్కయు అన్ని సంఘములనుండియు ప్రతినిధులుందురు.

## గ్రంథాలయముల విషయము

జిల్లా తాలూకాల గ్రంథాలయములయొక్క భవనముల నిర్మాణమునకై విశేష మొత్తములు విరాళముగ నొసంగబడెను. పల్లెటూళ్ల గ్రంథాలయములకు గూడ విశేషసహాయము చేయబడెను. అవి గ్రంథములు కొనుటకై 247500 రూపాయల విరాళమియ్యబడెను.

కేంద్రగ్రంథాలయముల విషయమై ఎక్కువ శ్రద్ధ దీసికొనబడినది. వీనివలన విశేషముగ ఉపయోగము కానుపించినది. అయితే కేంద్రగ్రంథాలయమునుండి గ్రంథములను వ్యక్తులకుగాక పల్లెటూళ్లయందలి గ్రంథాలయములకు మాత్రము ఎరువిచ్చుటవలన ఎక్కువ ప్రయోజనముండునని అనుభవపూర్వకముగ నిర్ణయించిరి. "బ్లూమ్స్బరీ"గ్రంథాలయమునకు ప్రతిసంవత్సరమందువలెనే 15000 రూపాయల విరాళమొసంగిరి. "వెస్టుమినిస్టరు"నందు గ్రుడ్డివారల గ్రంథాలయ భవనము నభివృద్ధిచేయుటకు రు 2,25,000ల విరాళమొసంగిరి. ఖయిదీలకు ఉపన్యాసములను గూడ యిప్పించిరి.

లండను నగరమందు గ్రంథభాండాగారులను తయారుచేయుటకొక పాఠశాలనుగూడ నిర్వహించుచున్నారు. ఈ పాఠశాలకు ప్రతి సంవత్సరము రు 22,500 విరాళమిచ్చుచున్నారు.

ఐర్లాండు దేశమందుగూడ ఈ సంఘమువారి ఆదరణక్రింద గ్రంథాలయములు విశేషాభివృద్ధిని జూపుచున్నవి.

సంగీతాభివృద్ధికి ఈ సంఘమువారు 30,000 రూపాయిలను నొసంగిరి.

శరీర పరిశ్రమాభివృద్ధికిగూడ రు 30,000 ల విరాళమొసంగిరి. విద్యార్థులకు వసతిగృహములకుగూడ విశేషద్రవ్యము ఖర్చుపెట్టిరి.

ఈ రీతిగా ఈ సంఘమువారు ఈ క్రింది మొత్తములను ఖర్చుపెట్టిరి.

| విషయము. | 1923 సం॥ గ్రాంటు. | 1924 సం॥ గ్రాంటు. |
|---|---|---|
| గ్రంథాలయములు | రు 8,41,695 | రు 11,88,060 |
| సంగీతము, నాటకము | 1,66,305 | 1,24 725 |
| శరీర పరిశ్రమ | 8,84,035 | 74,250 |
| వసతి గృహములు | 87 645 | 1,53,015 |
| చిల్లర | 19,020 | 61,830 |
| పల్లెటూళ్ల అభివృద్ధి | | 86,625 |
| వెరసి | 1998750 | 1688505 |

# వివిధ విషయములు

చిత్తూరు జిల్లా నారాయణవరమునందు శ్రీ సి. వి. రంగశ్రేష్ఠిగారిచే నిర్వహింపబడుచున్న శ్రీ హనుమద్గ్రంథాలయము, ఉచిత పఠనమందిరము, రాత్రి పాఠశాలలయొక్క షష్ట సప్తమ వార్షికోత్సవములు ఏప్రియలు నెల ౮ వ తేదీ సాయంకాలము మహావైభవముతో జరిగినవి.

ప్రథమమున గ్రంథాలయానుబంధమగు రాత్రిపాఠశాలయందలి విద్యార్థులగు నిరువురు ఆదిమాంధ్రబాలకులచే "సుజలాం సుఫలాం" యను జాతీయగీతమును పాడుటతో కార్యక్రమ మారంభింపబడినది. అటు వెనుక శ్రీమాన్ డి. శ్రీనివాసాచారిగారు "ముకుందమాలాస్తోత్రము" గావించి సభికుల నానందపరవశులుగా వించిరి. గ్రంథాలయనిర్వాహకులలో నొకరగు శ్రీమాన్ మాడభూషి శేషాచార్యులు బి-ఏ-ఎల్-టి. గారు చక్కని వాగ్ధోరణితో గ్రంథాలయస్థితిగతులు, స్థాపనోద్దేశములు, సాహాయ్యకుల యౌదార్యములను గూర్చి వివరించిరి. శ్రీ బి. మునిస్వామినాయుడుగారి ప్రతిపాదనమునను శ్రీ మా. శేషాచార్యులుగారి ఆమోదమునను కరతాళధ్వనులు చెలరేగుచుండ దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావుగారు పుష్పమాలాలంకృతులై, ఖాదీ వస్త్రములచే కాంగ్రెస్ వేదికపద్ధతి నమర్పబడిన అధ్యక్షకపీఠ మలంకరించి సుమారొకగంటసేపు గ్రంథాలయోద్యమము, ఆంధ్రోద్యమము, దేశభాషలు, కాంగ్రెస్ ఆదేశములు, ప్రజలబాధ్యత, ఆంగ్లేయులరాజ్యధర్మములు, మనదేశీయుల పరావలంబనము, రాట్నము దానివలని ఆర్థికము, విదేశవస్త్ర వ్యామోహము, దత్తమండలములలోని నాగలాపురమున జరిగిన ఖద్దరుపని మున్నగు విషయములపై ప్రతివారిమనస్సు కరగునట్లు మృదుమధురముగ మాటలాడి ప్రజాసామాన్యమున నూతనోజ్జీవనమును గలిగించిరి. తదుపరి గ్రంథాలయకార్యదర్శులలో నొకరగు శ్రీనివాసాచారిగారు గ్రంథాలయముయొక్క గతవత్సరముల కార్యనివేదికను నాంధ్రమున జదివి ముద్రణప్రతులను సభికులకు బంచిపెట్టిరి.

నిమ్నజాతులను గూర్చి శ్రీమాన్ కదాడై శేషాచారిగారును, గ్రంథాలయోద్యమమును గూర్చి బోడపాటి సత్యనారాయణగారును ఉపన్యాసములనిచ్చిరి. అధ్యక్షులు అంత్యోపన్యాసమును వందన సమర్పణమును అయిన పిమ్మట "ఆంధ్రమాత శ్రీసమేత" యను మంగళగీతముతో సభముగింపబడినది.

* * *

జ్ఞానోదయగ్రంథనిలయము-వీరవల్లిపాలెం

అమలాపురం తాలూకా వీరవల్లిపాలెం గ్రామమందు నెలకొల్పబడి దినదినాభివృద్ధి గాంచుచున్న శ్రీజ్ఞానోదయ గ్రంథనిలయముయొక్క ప్రథమవార్షికోత్సవము శ్రీ క్రోధన సంవత్సరాదిపండుగ దినమున శ్రీయుత పాలెపు హనుమంతరావు పంతులుగారి యాధిపత్యము క్రింద జయప్రదముగ జరిగినది. ఈగ్రంథనిలయస్థాపనకు ఆదినుండియు విశేషప్రయాసపడి పుస్తకాదులను సేకరించియు మూలధనమును గూర్చియు, జనుల ప్రోత్సాహపరచి వార్తాపత్రికల జదివించియు పాటుపడి గ్రంథనిలయము నభివృద్ధికి తెచ్చిన కార్యదర్శిగారగు ఏడిద నలమయ్యగారు గ్రంథనిలయముయొక్క స్థాపనాధికములను గూర్చియు అభివృద్ధి గూర్చియు, ఆదాయవ్యయములను గూర్చియు ముచ్చటించిరి. తదనంతరము పలువురు వ్యాసములను జదివిరి. అధ్యక్షుని అంత్యోపన్యాసమునకు పిమ్మట అల్పాహారములవిందును సంగీతకాలక్షేపమును జరిగినవి. ఈ గ్రంథనిలయమునకు 104 గ్రంథములనిచ్చి ప్రోత్సహించిన అడ్డేపల్లి హరికృష్ణమూర్తిగారికి (కాకినాడ) గ్రంథనిలయమువారు కృతజ్ఞతను వెల్లడిచేసిరి. నేటికి 539 పుస్తకములు గలవు. మూలధనము రు125 లు గలవు.

* * * *

గుంటూరు మునిసిపల్ ఆఫీసు ఆవరణయందు ధర్మగ్రంథాలయ మొకదానిని ఏప్రియలు నెల 6 వ తేదీన శ్రీ టంగుటూరి ప్రకాశంపంతులుగారు తెరచిరి.

ఆపురపాలక సంఘాధ్యక్షులగు శ్రీ నడింపల్లి వేంకటలక్ష్మీనరసింహారావుగారు తమ యుపన్యాసమునందు ఇట్లు చెప్పిరి.

"గ్రంథాలయమునకు మొదట ఇచ్చిన స్థలము ప్రభుత్వమువారు మరల తీసికొనిరి. కావున ప్రస్తుతము మునిసిపలు ఆఫీసులోనే ఒక గదిలో గ్రంథములనుంచితిమి. ఒక సంవత్సరము గడచినను గ్రంథాలయమును బహిరంగపరుపలేకపోయితిమి. ఇప్పుడది వీలయిన గంటలలో తెరచియుంచబడుచున్నది. గ్రంథాలయమునందు తెలుగు హిందీ ఇంగ్లీషు లను మూడుశాఖలు గలవు. స్త్రీలకు గూడ గ్రంథాలయ ముపయోగపడునట్లు మొన్ననే తీర్మానించితిమి. ఇక యీగ్రంథాలయ ముపయోగపడునట్లుగ తీర్మానించితిమి. ఇక యీగ్రంథాలయమునకు తగిన ప్రోత్సాహమును విరాళములను ఒసంగి పోషింపవలసిన బాధ్యత ప్రజలయందున్నది" అనిముగించిరి.

మామూలు ఉపపాదన, ఆమోదన జరిగిన తరువాత శ్రీ ప్రకాశంపంతులుగారు అధ్యక్షత వహించిరి. కరతాళములు చెలరేగ వారు ఖద్దరు పుష్పమాలాలంకృతులు గావింపబడిరి. గ్రంథాలయములలో వ్యవసాయ సంబంధమగు గ్రంథములు చాల అవసరమని చెప్పిరి. అంతట గ్రంథాలయము అధ్యక్షులచే యథాక్రమముగా తెరవబడెను. నూతనముగ నటులలో సేవ్య లగువారికి బహుమతు లొసగబడెను. వీణాగానము బహుశ్రావ్యముగ గావింపబడెను. 11 సం॥ వయస్సుగల చేర్మన్ గారి కూతురు అరగంటవరకు సభికులను విస్మితులను జేసెను. సి. . హెచ్. సుబ్రహ్మణ్యంగారు ప్రపంచగ్రంథాలయోద్యమమును హైందవగ్రంథాలయోద్యమముతో సరిపోల్చుచు నుపన్యసించిరి. శ్రీయుత దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు పౌరునియొక్క నిజధర్మములనుగూర్చి గంభీరముగ నుపన్యసించిరి. అంతట రాత్రి 9 గంటలకు అధ్యక్షునికి వందనములతో సభ ముగిసెను.

* * * *

రాజమహేంద్రవరమున ఇన్నీసుపేటయందు క్రైస్తవ మిషనరీలు ధర్మపఠనమందిరము నొకదానిని నిర్మించుచున్నారు. దీనికి ఆంధ్ర ఆంగ్లేయ పత్రికలనేకము నమ్ముచున్నవి. ఏప్రిలు నెల 4 వ తేదీన తొమ్మిదవ వార్షికోత్సవము కంభంవారి సత్రం వీధిని నూతనముగా మిషన్ వారు కొన్న ఆవరణలో శ్రీ రాజా మంత్రిప్రగడ భుజంగరావుగారి అధ్యక్షతను జరుపబడెను. అధ్యక్షులు కార్యనిర్వాహకులు చేసిన కృషిని ప్రశంసించి, క్రైస్తవమతము ప్రేమ, దయ అనువానిపై ఆధారపడియున్నదనియు ప్రస్తుతము కాంగ్రెసు యాజమాన్యమున సర్వపక్షములవారు సమ్మేళనము కమ్మని ప్రయత్నించు సంకల్పము క్రైస్తవసిద్ధాంతమగు ప్రేమ సహనములపై ఆధారపడియున్నదనియు చెప్పిరి.

## శ్రీ కృష్ణదేవరాయ గ్రంథ నిలయము, కొండపల్లి.

### (ద్వితీయ సంవత్సరచర్య, 1924 మార్చి మొదలు 1925 ఫిబ్రవరి ఆఖరు వరకు)

ఈసంవత్సరమంతయు మంచి ప్రోత్సాహ మొసంగుచు విద్యాభిమానము నే పరమానందముగా నెంచి ప్రియ ప్రియాసల కోర్చిన మాసోదర పోషకులు, చందాదారులు, అభిమానులు, మొదలగు గ్రంథాలయము కార్యనిర్వాహక వర్గమువారి కృతజ్ఞతను దెలుపుచు వారికాయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధుల నొసంగుగాతయని పరాత్పరుని ప్రార్థించుచున్నాము.

వారు చందాదారులు గాకపోయినను గ్రంథాలయమునం దభిమానముంచి యెక్కువ వెలగల పుస్తకములను కొనియిచ్చిన కొట్టె నరసింహదాసుగారు, అత్తలూరు చినసరసయ్యగారు, అక్కుల గంగాధరరావు నాయుడుగారు, నందిగామ తాలూకా మద్దూరు కాపురస్థులు అన్నపరెడ్డి ఉసేనురెడ్డి గార్లున్నూ, ఇంకా కొద్దిగా గ్రంథములు యిచ్చినవారలున్నూ యగు సోదరులందరకు మా గ్రంథాలయ కార్యనిర్వాహకవర్గము వారి తరపున హృదయపూర్వక వందనము లర్పించుచున్నాము.

గ్రంథాలయ మందలి గాఢానురాగముచే యిల్లిండు గ్రామములలో తగు శ్రద్ధవహించి ధర్మచందాలను వసూలు చేయుచున్న సోదరులందరకునుకూడ సానుభూతి తెలుపుచున్నాము.

మా గ్రంథాలయమునకు స్వంతభవనము లేని లోపమును సుప్రసిద్ధ గ్రంథరాజములు లేని కొరతను దీర్చి మా యుద్యమమును జయప్రదముగా నెరవేర్చగలందులకు భాషాభిమానులందరు తోడ్పడుదురుగాక!

ఈ గ్రంథాలయమందు 569 గ్రంథములు గలవు. 74 గురు చందాదారులు గలరు. 5 సభలు జరిగినవి. 3210 మంది గ్రంథాలయమునకు వచ్చిరి. చందాదారులు 1145 గ్రంథములను ఇండ్లకుతీసుకొనిపోయిరి. ఈసంవత్సరం జమ మొత్తం రు 275-8-½ ఖర్చు రు 213-11-½.

గూడగుంట్ల శ్రీరామమూర్తి,
కార్యదర్శి.

---

కాకినాడ అఖిలభారత గ్రంథాలయసభకు మొత్తము రు 1727-8-9 లు వసూలైనవి. అందులో ఖర్చులుపోను మిగిలిన సొమ్ము రు 238-6-6 లను అఖిలభారత గ్రంథాలయసంఘమునకు ఇచ్చిరి.

బెల్గాం అఖిలభారతగ్రంథాలయసభకు మొత్తం రు 397-0-0 లు వసూలయ్యెను. అందులో ఖర్చులుపోను శేషించిన రు 329-14-0 లు అఖిలభారత గ్రంథాలయ సంఘమునకు ఇవ్వబడినవి.

బెంగాలులో స్వరాజ్యపార్టీకి పట్టుకొమ్మయు, గొప్ప దేశాభిమానియు, జమీందారును నగు టి. సి. గోస్వామి గారు అఖిలభారత గ్రంథాలయ సంఘమునకు రు 100 ల విరాళ మొసంగిరి.

# ఈడు ముదిరినవారికి విద్యాభివృద్ధి చేయుమార్గములు

## (ADULT EDUCATION)

ఈ కాలమున మన దేశమందు సామాన్యముగా విద్యాదానము చేయు సంస్థలు పాఠశాలలే. ఈ మూలమున కోమలవయస్సునందున్నవారే విద్యను పొందగలరు. ఆవయస్సు మీరినవారు విద్యాభివృద్ధి నొందించుకొను సాధనములు మన దేశమున నేమియు లేవనియే సామాన్యముగా చెప్పవచ్చును. పూర్వము మన దేశపు స్థితిగతులు ఇట్లుగాదు. ఇప్పటి కాలమునకూడ స్వరాజ్యమనుభవించుచు ఆధునిక నాగరికతయందు వన్నెకెక్కిన పాశ్చాత్యదేశములయందును జపాను, చీనా మున్నగు ప్రాచ్యదేశములయందుకూడ నిట్లు కాదు. మనదేశము నిప్పుడు చీకాకుపరుచుచున్న సమస్యలను తృప్తికరముగా సమాధానము చేయుటకు ముఖ్యముగాను అత్యవసరముగాను మనము పూనుకొనవలసిన పని "ఈడు ముదిరినవారి విద్యాభివృద్ధినిగూర్చినది" ఈపనిని మన మెంతకాలము పూనుకొనక యుపేక్షించెదమో, ఆపనికి తగినంత ప్రాధాన్యముతోను, సమగ్రతతోను, దానిని నిర్వహించమో అంతకాలమును మన దేశము దురవస్థయందుండవలసినదే. మరియొక విషయము. ఇందునుగూర్చి ప్రభుత్వమువారు వెంటనే పూనుకొనరు. ప్రజలే ఈ కార్యభారము వహించి, సాధనవిధానమును నిర్ణయించుకొనవలసియున్నది. ఈ నిర్ణయమందు ఆధునిక నాగరికత దేశముల స్థితిగతులు మాత్రమేగాక పూర్వపు మన దేశమందలి సంస్థలుకూడ మనకు సహాయము నొసగగలవు.

పాఠశాలకు వెళ్ళతగిన ఈడును మించినవారు మన దేశమున ఎన్నితరగతులవారున్నారో ముందుగా మనము పరికించి చూతము. పల్లెటూరు పాఠశాలలలో ప్రాథమిక విద్యను మాత్రము అభ్యసించి తమకు నిర్ణయమైన వ్యవసాయమో, పల్లెటూరు చేతిపనులనో అవలంబించి తన్మూలమున జీవయాత్ర గడుపువారు మొదటి తరగతివారు. ఇట్టి పల్లెటూండ్లయందు నివాసముకలిగి విద్యాగంధమేమియు లేనివారు రెండవ తరగతివారు. కేవలము కూలి నాలి చేయుచు తన్మూలమున జీవయాత్ర గడుపుచు పల్లెటూండ్లయందే నివాసము కలవారు మూడవ తరగతివారు. కేవలము సంస్కృతమును ఆంధ్రమును పూర్వకాలపు మార్గమున అభ్యసించి పల్లెటూండ్లయందు పూర్వార్జితమగు భూములమీద నాధారపడియున్నవారు మరియొక తరగతివారు. ఏ స్కూలు ఫైనలు వరకో అంతకు లోపుగానో లేక పైగానో ఏపట్టణమందో యభ్యసించి భగ్నమనోరథులై పూర్వార్జితాస్తి నపేక్షించి తిరిగి పల్లెటూండ్లకు చేరి అక్కడ జీవయాత్ర గడుపుచుండువారు మరియొక తరగతివారు. నిశ్చితముగా ఏవృత్తియును లేక పిల్లిమీద ఎలుకను ఎలుకమీద పిల్లిని ఎక్కించుచు తమ జీవనమునకు కేవలము ఇతరులపై నాధారపడియుండి పల్లెటూండ్లను చీకాకు పరచుచున్న "జ్ఞానలవదుర్విదగ్ధులు" కొందరు, వీరొక ప్రత్యేకతరగతిగా పరిగణింప తగియున్నారు. పైన చెప్పినతరగతులవారందరును పల్లెటూండ్ల నాశ్రయించియున్నవారే.

ఇక బస్తీలలోనున్న ఈడుముదిరినవారినిగూర్చి విచారింతము. ఇందు ముఖ్యముగా పరిగణింప తగినవారు పాశ్చాత్యవిద్యల నభ్యసించి అందు ప్రావీణ్యత పొంది తన్మూలమున జీవనాధారము నేర్పరచుకొన్నవారు అగ్రగణ్యులు. ఉద్యోగముల నపేక్షించక వర్తకము మొదలగు ముఖ్యమగు వృత్తుల నవలంబించి ఐశ్వర్యముతో తులతూగుచున్నవారు మరియొక తరగతివారు. అంత ఐశ్వర్యవంతులు కాకపోయినను స్వతంత్రవృత్తి నవలంబించి మర్యాదగా జీవనము గడుపుచున్నవారు ఇంకొక తరగతివారు. కేవలము కలముపోటువల్ల జీవనము చేయు సామాన్యముగా వర్తకుల గుమాస్తాలు, న్యాయవాదుల గుమాస్తాలు మొదలగు వారందరును ఒక ప్రత్యేక తరగతిగా నెన్నతగినవారు. అందరికన్న ఎక్కువ సంఖ్య కలిగినట్టియు, ప్రాముఖ్యత వహించినట్టియు వారు నిరక్షరకుక్షులైన పాటకపుజనులు. వీరందరికి అతీతులైన వారు నిర్దిష్టమగు వృత్తి ఏదియు లేక పరులను దురదృష్టములపాలు చేయుటయే తమ జీవనాధారముగా కలవారు. ఆధునిక కాలమున అన్ని దేశములలోను ఈ తరగతివారి సంఖ్య దినదినాభివృద్ధి నొందుచున్నట్లు మనము చూచుచున్నాము. ఈ పైన చెప్పిన అన్ని తరగతులవారును విద్యాభివృద్ధి పొందవలసినవారే.

విద్య అనంతము. సర్వకాల సర్వావస్థలయందునను సేవించి సంపాదించతగినది. ఇప్పటికాలమున మన దేశమున విద్య కేవల జీవనాధారముగా సామాన్యముగా పరిగణింపబడుచున్నది. అట్లేమియు కాదు. విద్య సామాన్యముగా నాల్గుభాగములుగ విభజింపతగును. ఒకటి: వృత్తికి సాధనభూతమైనది. రెండవది: పౌరసత్వపు హక్కు బాధ్యతల నలవడ చేయునది. ఆత్మవికాసమునకును మనోవికాసమునకును యుపకరించి మనుజుని ఆనంద నిమగ్నునిగా చేయతగినది మూడవది; ఆత్మ

సంరక్షణకొరకు వినియోగపడు విద్య నాల్గవ తరగతిది. ఈనాల్గువిధములగు విద్యయు ప్రతివ్యక్తికిని కొలదిగనో గొప్పగనో యుండి తీరవలసినదే

ఏదియో విద్యయందు ఇదివరకే ప్రావీణ్యముచెంది తమంతట తాము పుస్తకసహాయ్యమున విద్యాభివృద్ధి స్వయముగ చేసుకొనగలవారికి జ్ఞానాభివృద్ధికి ముఖ్య సాధనములు పౌరగ్రంథాలయములు. వీని సంఖ్య మన దేశమున హెచ్చయి ప్రతిపల్లెయందును బస్తీయందును ఈ సంస్థలు వెలసి దినదినాభివృద్ధినొందిన గాని ప్రజల పరిజ్ఞానము అభివృద్ధిచెందనేరదు. కేవల వృత్తిసాధకమగు విద్య వ్యక్తికి ఆనందమును సమకూర్చనేరదు. సంపూర్ణమానవానందము నియ్యజాలదు. కావున ఈడుముదిరినవారి విద్యాభివృద్ధికి సాధనమగు సంస్థలలో అగ్రగణ్యమైనది పౌరగ్రంథాలయము.

రెండవది సంచార గ్రంథాలయము పేటికల మూలమున పల్లెలందును పల్లెటూళ్లయందును చదువరులకు గ్రంథములను వారి వారి అవసరములను బట్టియు రుచులను బట్టియు యందచేయుట. ఈమూలమున పాశ్చాత్య దేశములయందు జరుగుచున్న విద్యాప్రచారము వర్ణనాతీతము. ఆదేశపు శ్రీమంతులు ఈ సంస్థలకొరకై మితిలేని ద్రవ్యమును వెచ్చించి దేశోద్ధారకులగుచున్నారు. మన దేశమునకూడ దేవళములను, సత్రములను, స్థాపించి దేశోపకారము చేయుచున్న లక్ష్మీపుత్రులు, "అన్ని దానములలో విద్యాదానము ప్రశస్త" మను యార్యోక్తి ననుసరించి గ్రంథాలయముల స్థాపించి తన్మూలమున విద్యాదానము చేయగడంగుటకు ప్రార్థితులు.

గ్రంథాలయములు పుస్తకములమూలమున విద్యాభివృద్ధిని తమంతటతామే పొందగలవారలకే యుపకరించును. మన దేశమున నిరక్షరకుక్షుల సంఖ్య అగణ్యము. కేవలము చదువుట, వ్రాయుటమాత్రమే తెలిసినవారు చదువు వచ్చినవారిలో లెక్కకు వచ్చినను, స్వయముగా పుస్తకములు చదివి తమకు కావలసిన జ్ఞానము సంపాదించుటకు తగిన సామర్థ్యము లేనివారై యున్నారు. పైన చెప్పిన తరగతివారు మన దేశమున ఎందరో యున్నారు. వీరందరికి పైన చెప్పబడిన నాల్గు విధములగు విద్యను యలవడచేయు మార్గములను మన దేశస్థితిగతుల ననుసరించి మనము వెంటనే నిర్ణయించి ఆచరణలోనికి తెచ్చుట అవశ్యకర్తవ్యము.

ఇందునుగూర్చి పూర్వకాలమున మనదేశమున ఎట్లు [illegible] ఇతర దేశములనెట్లు కృషి జరుగుచున్నదియు ప్రథమములో గమనించెదము. పూర్వకాలమందు మన దేశమున పల్లెటూండ్లవారు దినమంతయు శ్రమపడి ఇంటికివచ్చిన పిదప విశ్రాంతికొరకును జ్ఞానాభివృద్ధికొరకును ఏకటాక ప్రాంతమునందో లేక తమచ్చాయలో చేరుచుండెడివారు. అక్కడ గ్రామమందలి పెద్దలు విచ్చేసి తమ లోకానుభవమును జ్ఞానమును ఇతరులకు అబ్బునట్లు బోధించెడివారు. పాదచారులై దేశమంతట తిరుగుచు లోకకల్యాణమే తమ శ్రేయస్సుగా నెంచుకొనెడి సాధువులు ఈ సమావేశములకు విచ్చేసి తమ యమూల్య పరిజ్ఞానమును జానపదులకు బోధించి వారల ధన్యులజేసెడివారు. ఆ కాలము వేరు. ఈ కాలము వేరు. అప్పటిస్థితిగతులు పూర్తిగా మారినవి. ఈ సమావేశములవల్ల పూర్వము ఈడు ముదిరినవారికి జ్ఞానాభివృద్ధి చేసుకొనుటకుగల సావకాశములన్నియు ఇప్పుడు సంపూర్ణముగా నశించినవి — వాని స్థానమున నూతన సంస్థలేమియు నిర్మాణము కాలేదు. ఈ లోపమునే మనము వెంటనే పరిపూర్తి చేయవలసియున్నది.

దేవాలయము మరియొక సంస్థ. మన దేవాలయములు పరమేశ్వరారాధనకేర్పడిన పూజాస్థానములు మాత్రమే కావు. మన దేవళము వివాహములకు సాక్షి. ధర్మశాస్త్ర చర్చలకు సభాభవనము, పరదేశీయులకు ధర్మశాల. పసివాండ్రకు ప్రాపు. సన్యాసులకు మఠము. భక్తవరుల కునికిపట్టు. ఇదియదియననేల ప్రజలకు జీవనాధారమై విద్యాపోషకమై ఆనందాంబుధియై దేవళము విరాజిల్లుచుండె. మనుజుడు జీవయాత్రయం దలవడచేసుకొనవలసిన సద్గుణము లన్నిటికిని శిక్షాస్థానముగను సర్వవిధములగు విద్యను బోధించెడి పాఠశాలగను మన దేవాలయములు అభివృద్ధి గాంచియున్నవి. అన్ని అంతరముల నుండు ప్రజలును అచ్చట సమావేశమై అన్యోన్య స్నేహముచే ఏకలక్ష్యమున మనస్సును లగ్నము చేసుకొన్నకారణమున సంపూర్ణ సోదరభావమును తన్మూలమున యలవడచేసుకొనుచుండిరి. దేవళములయందు చిత్రింపబడియుండు చిత్తరువులు మిక్కిలి మనోరంజకములై చిత్తశుద్ధిగావించి ఈశ్వరుని అనంతకల్యాణ గుణానుభవము కొలదికాలమునకైనను మనుజునికి సమకూర్చుటకు తగు సమర్థములై యున్నవి.

పురాణ కాలక్షేపములును హరికథా కాలక్షేపములును మన దేశమున ఎక్కువ ప్రసిద్ధిగాంచి ప్రాజ్ఞులకును పామరులకునుకూడ తారకమై వెలయుచుండెను. ఈ కాలమున హరికథా కాలక్షేపములు పూర్వమునకన్న

ఎక్కువ విరివిగా జరుగుచున్నను పూర్వమువలె విస్పష్ట ధర్మములతో వేరువేర్పునవిగా నుండక వేరుగా పరిణమించుచున్నవి. హరికథా కాలక్షేపమందేమి, పురాణ కాలక్షేపమందేమి ప్రధానాంశము "కథకుని" యోగ్యతయు పాండిత్యమును. ఇప్పటి కథకులలో ఇట్టి యోగ్యత గలవారు బహు అరుదు.

శ్రోతలుగూడ కథకుని సంగీత విద్యాపాండిత్యమును బట్టియు కంఠశ్రావ్యమును బట్టియు వారి యోగ్యతను నిర్ణయించుటకు ప్రయత్నింతురేగాని కథ యందలి యంశముల ప్రాశస్త్యమును బట్టియు, ప్రజల మనసులను ఆహ్లాదపర్చి ఆకర్షించగల శక్తి ననుసరించియు అట్లు నిర్ణయించరు. ఈ రెండు సంస్థలును విస్పష్ట ధర్మములను నిర్వర్తించు విధముగ దేశమంతటను తిరిగి వ్యాపించినచో ఇందుమూలమున జనసామాన్యమునకు కల్గెడి జ్ఞానాభివృద్ధి కడుమెండు. వీనియందలి యుత్కృష్టత ఏక కాలమున వివిధాంతరములు గల్గినట్టియు వివిధ రుచులను అభిప్రాయములను కల్గినట్టియు సభ్యులను ఆహ్లాదపర్చి వారికి అవసరమైనట్టియు అభివృద్ధికరమైనట్టియు విషయములనుగూర్చి వారికి హృద్యముగా నుండునట్లును చులకనగా గ్రహించుటకు వీలుగా నుండునట్లును జ్ఞానబోధ చేయుటకుండు కడు సామర్థ్యము కల్గియుండుట యందు యుండియున్నది. మన దేశమున ఈ రెండు సంస్థలను ప్రథమమున హిందూమతస్థులేకాక ఈ కాలమున ఇతరమతస్థులుకూడ ఈ మూలమున జ్ఞానాభివృద్ధి చేయుటకు గల ఎక్కువ సావకాశములను గమనించి వానిని గ్రహించి యున్నారు.

ఇక ముందు పాశ్చాత్యదేశములయందు ఇందునుగూర్చి జరుగుచున్న కృషినిగూర్చి వివరించెదము.

# కేంద్రగ్రంథాలయము

మనదేశమున అప్పుడప్పుడు జరుగుచున్న గ్రంథాలయ సభలకు వెళ్లుచుండెడి ఏ సామాన్య ప్రేక్షకుడైనను అట్టి సభయందును "కేంద్ర గ్రంథాలయములను" గూర్చి తప్పక చర్చింపబడుచుండుటయు అందునుగూర్చి ఏయో యొకవిధమగు తీర్మానమును చేయుటయు గమనించియేయుండును. ఈ విషయమునుగూర్చి గ్రంథాలయోద్యమాభిమానులు ఎక్కువ ఆసక్తితో కృషిచేయుచుండుట కడు శుభావహము. కేంద్ర గ్రంథాలయ మననేమి! దాని పనులెవ్వి? అది సంయుక్తవిధానమునను సంబంధించి నిర్మాణముకావలెనా? అట్లుకాదా? అనుబంధ గ్రంథాలయములకును కేంద్ర గ్రంథాలయములకును అన్యోన్యసంబంధ మెట్లుండవలెను? కేంద్ర గ్రంథాలయము గ్రంథాలయోద్యమాంతర్గతమగు పనులలో వేనిని నిర్వర్తించవలెను? ఈ పనులను నిర్వర్తించుటకు అవలంబించవలసిన సాధన విధానమెద్ది? కేంద్ర గ్రంథాలయసంఘమందు సభ్యులుగా నుండతగినది ప్రత్యేక గ్రంథాలయములు మాత్రమేనా, లేక ప్రత్యేక వ్యక్తులుకూడ ఇందు సభ్యులుగా నుండవచ్చునా? ఈ సంఘముయొక్క కార్యనిర్వాహక వర్గమును నిర్మాణము చేయుటయెట్లు? ఈ యుద్యమమున కృషిచేయువారందరును పైన చెప్పిన విషయములను గూర్చియు ఇందునుసంబంధించిన ఇతర విషయములను గూర్చియు కొంతకాలమునుండి తీవ్రముగా చర్చించుచున్నారు. కావున గ్రంథాలయోద్యమాభివృద్ధి యొక్క అభివృద్ధినిగూర్చి చేయు ప్రయత్నములలో కేంద్రగ్రంథాలయనిర్మాణము ప్రాధాన్యము వహించియుండుటచే ఇందునుగూర్చి సజ్ఞానము దేశమందు విరివిగా వ్యాప్తినొందుట మిక్కిలి అవసరమును ఆవశ్యకమునై యున్నది.

పైన చెప్పబడిన ప్రశ్నలను తూచినట్లు వెంటనే ప్రత్యుత్తరమిచ్చుటకు వీలులేదు. అన్ని ప్రదేశములకు వర్తించగల ప్రత్యుత్తరములనిచ్చుటకుకూడ వలనుపడదు. దేశకాలపాత్రముల ననుసరించి ఈ జవాబులు మారుచుండును. అట్లయ్యును అన్ని కేంద్రగ్రంథాలయములకును వర్తించగల సామాన్యధర్మము లుండకపోవు. కావున ప్రపంచమందలి వివిధదేశములయందును కేంద్ర గ్రంథాలయము లెట్లు కృషిచేయుచున్నవో ముందుగా మనము తెలుసుకొని అందుననుసరించి మనదేశపు కేంద్ర గ్రంథాలయములనిర్మాణమునకు మనము పూనుకొనవలసియున్నది.

ప్రథమమున బరోడా రాష్ట్రమందలి కేంద్రగ్రంథాలయమునుగూర్చి విచారింతము. "తనదేశ ప్రజల నెట్లు అభివృద్ధికి దెచ్చెదనా" యని బరోడా రాష్ట్ర

శులగు శాయాజీగాయక్వాడ్ గారు అహర్నిశము మననము చేయుచు ద గా. 1910 సంవత్సరమున అమెరికాఖండమున గాయాక్వాడ్ గారు పర్యటనను చేయు కాలమున అచ్చటనందలి సర్వసామాన్యమగు ప్రజలయందు కూడ వ్యాపించియున్న "గ్రంథాలయోద్యమమతము"ను శ్రీ వారు గమనించి జ్ఞానాభివృద్ధి పొందవలెనన్నచో యట్టి యాసక్తియే తన ప్రజలకు కూడ కల్గించుటకు ఆయన సంకల్పించెను. శ్రీ వారు ఇకను స్వదేశము చేరక పూర్వమే ఇందుకు తగిన పనిని ప్రారంభించుటకై అమెరికా ఖండవాస్తవ్యులగు బోర్డెను గారిని బరోడారాష్ట్రమందు నలుదెసలను "ధర్మగ్రంథాలయోద్యమమును" సర్వాంగసౌష్ఠవముగ వ్యాపింపచేయుటకు నియమించి అందుకు తగిన సదుపాయములను వెంటనే ఏర్పరచిరి. బోర్డెను గారు బరోడాయందు "కేంద్రగ్రంథాలయ ప్రతిష్ఠాపనను" నిర్మాణము చేసి దానిని కేవల బరోడారాష్ట్రమునకే గాక అఖిలభారతదేశమునకంతటికిని అదర్శప్రాయముగను ఆశ్చర్యప్రదముగను చేసిరి. దేశమందలి పరిస్థితులను వివరముగా గమనించి వారి స్వయముగా పొందుటకు తగిన కార్యవిధానమును నిర్ణయించుట మొదటపని. ప్రథమమున "బరోడా కేంద్రగ్రంథాలయ ప్రతిష్ఠాపన" నిర్మాణము చేయబడినది. ఈ ప్రతిష్ఠాపన యొక్క యాజమాన్యమున రాష్ట్రమందంతటను నలుదెసలను ఉద్యమము దట్టముగా వ్యాప్తినొందించబడినది.

బరోడా ప్రాంతముతో చేరి బరోడా రాష్ట్రము 4 ప్రాంతములు (లేక సుబాలుగా) విభజింపబడియున్నది. ఇవిగాక 38 ఇతరపట్నములును, 426 పల్లెటూళ్లును ఇంకనెన్నియో చిన్నపల్లెలును ఈ రాష్ట్రమున గలవు. బరోడా రాజధానీనగరమున సర్వాంగ సౌష్ఠవమగు కేంద్రగ్రంథాలయముండునట్లు నిర్ణయింపబడినది. ఇందులో శముల మొదలగు యద్గ్రంథములు (Reference section) తో నిండిన ప్రత్యేకశాఖ ఏర్పరుపబడినది. ఇందలి గ్రంథములను రాష్ట్రమందు గ్రంథాలయముల వారందరును తగిన కట్టుబాట్లకు లోబడి తెప్పించుకొని ఉపయోగపరచుకొనవచ్చును. తక్కిన మూడు ప్రాంతముల ముఖ్యపట్టణముల యందును ఇట్లే 20,000 గ్రంథములుగల కేంద్రగ్రంథాలయము లుండునట్లు నిర్ణయించబడినది. 36 పట్టణములలోను ఒక్కొక్క పట్టణమున 5,000 గ్రంథములుగల గ్రంథాలయములు నిర్మాణము చేయవలెనని నిర్ణయింపబడినది. పెద్దపల్లెగ్రంథాలయముల యందు ఒక్కొక్కదానియందు 500 గ్రంథములును చిన్నపల్లెలలో 200 గ్రంథములుగల గ్రంథాలయములును యుండవలెను. "ప్రతిపట్టణమునకు, పల్లెయునకును గల గ్రంథాలయసంఘము స్వపరిపాలనగలదై యుండియు కేంద్రగ్రంథాలయమునుండి ప్రతి చిన్న గ్రంథాలయమువరకును అన్యోన్య సంబంధముకలదై క్రింది తరగతి ప్రతిష్ఠాపనపై పైతరగతి ప్రతిష్ఠాపనకు పైలవిజీ కనుక్కొనునట్లుగా ఈ పెద్ద నిర్మాణమందంతటి యందును అన్యోన్యాశ్రయధర్మము ప్రతిష్ఠింపబడినది. "అన్ని గ్రంథాలయములును ప్రతిపాఠకుడు స్వతంత్రముగా యుపయోగించుకొనవచ్చును. పైన చెప్పిన విధానమునను సరించి ఏకగ్రామనివాసియు ఏ పాఠకుడైనను రాష్ట్రమందలి ఏ గ్రంథాలయమందున్న ఎట్టి యుద్గ్రంథముయొక్కనైనను ఉపయోగమును అతి సులభముగా పొందగలడు. రాష్ట్రమందలి ఈ మహోద్యమమంతయు కేంద్రగ్రంథాలయ ప్రతిష్ఠాపన యాజమాన్యము క్రింద నడుపబడుటకు తగిన సదుపాయములతో ఉద్యమనిర్మాణము ప్రారంభింపబడినది." పైన వివరింపబడిన ప్రణాళికను బట్టి సాక్షరులకు మాత్రము విద్యాభివృద్ధి చేయును. ఇక నిరక్షరకుక్షుల గతి ఏమి కావలెను? ప్రత్యేకముగ గ్రంథాలయములను భరించలేని చిన్నపల్లెటూళ్లెన్నియో కలవు. పట్టణములలో గూడ గ్రంథాలయముల కందుబాటులో లేని ప్రజలెందరో యున్నారు. ఇట్టి ప్రదేశములందలి యుపయోగము కొరకును కార్యవిధానము వేరుగా అవలంబించవలసియున్నది. బరోడా కేంద్ర గ్రంథాలయమున కనుబంధముగ సంచారగ్రంథాలయపెట్టెలు ఏర్పరుపబడినవి. ఈ పెట్టెలయందు సర్వజనుల అభిరుచులకు దగినట్లు వివిధాంశములను గూర్చిన గ్రంథములుంచబడి అవి ఉపయోగించుకొనతగిన జనులున్నచోట్లకు పంపబడుటకు ఏర్పాట్లు చేయబడెను. ఈ పెట్టెలు చులకనగా ఒకచోటనుండి మరియొకచోటుకు తీసుకొనివెళ్ళుటకు వీలుగా నుండునంత తేలికగా చేయబడినవి. 1923 సంవత్సరాంతమునకు ఇట్టి పెట్టెలు 350 యుండెను. వీనిలో పెట్టుటకు ప్రత్యేకము 11,546 గ్రంథములు ఏర్పరుపబడియుండెను. ఆసంవత్సరమున రాష్ట్రమందలి నలుదెసలయున్న 166 సెంటరుల ద్వారా 5276 ప్రజలకు ఈ 11,546 గ్రంథములను పంచిపెట్టబడినవి. ఇంత విశ్వప్రయత్నములు చేసినను విద్యాగానము తగినంత ప్రజలకు చేయుటకు వీలుకలుగక పోయెను. ప్రజలందరికిని చదువురానికారణమున వీరలకు ప్రత్యేకపు ఏర్పాటు చేయవలసియున్నది. వీరలకు ఉపయోగ

RSVM01A129



ముకొరకు సినిమా, బయస్కోపు మొదలగు సాధనముల మూలమున ప్రజల జ్ఞానాభివృద్ధి చేయుటకు ప్రత్యేకముగా కేంద్రగ్రంథాలయప్రతిష్ఠాపనయొక్క యాజమాన్యము క్రింద ఒక యిలాకా ఏర్పరుపబడినది. మరియు సర్వజనులకు తెలియునట్లు ఉపన్యాసముల నిచ్చుచు అందలి యంశములకు దృష్టాంతముగా నుండునట్లు యంత్రసహాయమున విషయములు ప్రదర్శింపబడుచుండెను. ఈవిధమున నెంతయో కృషి జరిగి జ్ఞానదానము చేయబడినది.

---

# గ్రంథభాండాగారి

[లండనునగరమందు జరిగిన పల్లెటూళ్ళగ్రంథాలయప్రతినిధుల మహాసభయందు కలనల్ మిట్‌ఛెల్ నుడివినది]

పురుషుడైనను స్త్రీయైనను గ్రంథభాండాగారిగా నుండువాడు తాను చేయుపనియొక్క ఉత్కృష్టతను గ్రహించినవాడై విద్యావంతుడై ఉండవలెను. అతడు గ్రంథాలయ శాస్త్రమును కొంతవరకైన అభ్యసించియుండవలెను. వీనియన్నిటికంటెను ముఖ్యమైనది గ్రామస్థుల విశ్వాసమును పొందినవాడై యుండి అర్హతనుబట్టి ఏమనిషికి ఏగ్రంథము కావలయునో ఆమనిషి కాగ్రంథమును అందజేయుటకు సాధ్యమైనంత శ్రమను తీసుకొనువాడై యుండవలయును. విద్యాశాఖ ఉద్యోగులు, ఇతర సంఘములు మొదలగువానితో ఎక్కువ సంబంధమును కలిగియుండ యేగాక గ్రామస్థుల యొక్క సాంఘిక అవసరములను జ్ఞానపిపాసావసరములను గ్రహించియుండవలయును. అక్కడి వర్తకములను పరిశ్రమలను అతడు పరిశీలించి ఉద్యోగములు చేయువారికి పౌరులకు మొత్తముమీద అందరికి ఉపయోగపడునట్లుగా ద్రవ్యమున్నంతవరకు గ్రంథములను తెప్పించి అందజేయవలయును. అతడు వెనుకటికాలపు గ్రంథభాండాగారికియుండు ఆచారములను పూర్తిగా వదలివేసి అవసరమైన గ్రంథములకు ఎక్కువ ప్రతులనుంచుచు అరల యందుండు ఏ గ్రంథము గాని వృథాగా పడియుండకుండు నటుల జూడవలెను.

ముఖ్యముగా ప్రారంభసంవత్సరములందు అతడు తన గ్రామమంతయు తిరుగుచుండవలయును. పగటిగంటలు తక్కువగానుండునట్టియు, ప్రయాణము చేయుటకు కష్టతరముగానుండునట్టియు శీతాకాలమునందు అతడు ఉపాధ్యాయులను కలిసికొని ఉపన్యాసముల నిప్పింపవలయును. ప్రయాణసౌకర్యము చౌక అగునటుల చేయవలయును. రుచినిబట్టి స్వాభివృద్ధిని జేసికొనుటకై చదువునెడల ప్రేమను పుట్టించుటకుగాను దేనినైన చేయగలవారి తోడ్పాటును దీసికొనవలయును. “డ్యూయీ” గారి డెసిమల్ వర్గీకరణపద్ధతిని గాని, లేక “కట్టరు” గారి గ్రంథవిభజనపద్ధతిని గాని దేవాలయమందలి దేవునివలె పూజించు గ్రంథభాండాగారివలన ఎంతమాత్రము ప్రయోజనములేదు. అట్టి గ్రంథభాండాగారికి గ్రంథాలయమందుగల ప్రయోజనము ముఖ్యముగా స్వార్థముగుటచే అతడు స్వల్పజీతమును తీసికొనవచ్చును. గడ్డి సమృద్ధిగా గలిగియుండిన బీడునందుండియు మేయజాలని ఆవువలె అట్టివాడు నిరర్థకుడు. రెండువందల గ్రామాదులు తిరిగి బోధకునివలె పనిచేయవలసియుండి ౧౪ మొదలు ౯౦ సంవత్సరములవరకు గల జనుల అవసరములను తెలిసికొనగలిగిన చురుకైన వానికి అల్పజీతమిచ్చుట అవివేకము.

చాలస్థలములయందు గ్రంథభాండాగారికి సహాయకుడుగూడ నుండుట అవశ్యకము. ఇద్దరున్నప్పుడు వంతులు వేసికొని గ్రామములను చుట్టివత్తురు. సహాయకుని జీతమెంతయో నిర్ణయించుటకు ఇంత త్వరగా వీలులేదు. ముందు ఒకపద్ధతి ఏర్పడినకొలదియును, దాని అంతట అదియే నిర్ధారణ కాగలదు.

---

## మనసు ఫౌండేషన్

## పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | RSVMOIA 129 |
| పుస్తకం పేరు | ఆంధ్రుల సర్వస్వము |
| తారీఖు | 7/6/21 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | NO |
| మొత్తం పేజీలు | 21 |
| పెద్ద సైజు పేజీలు | No |
| ఖాళీ పేజీలు | NO |
| లేని పేజీలు | No |
| తయారు చేసినది | Sandhya |
| పేజీలు విడదీసినది | sandhya |
| స్కాన్ చేసినది | Sandhya |
| పరీక్ష చేసినది | PRAGATHI |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనివి | |
| తప్పులు | No |
| పరిస్థితి | good |